జయమునీయవే.. జగదేక మాత

- గ్రామాల్లో ఘటాల ఊరేగింపు, కుంకుమ పూజలు
- మహిషాసురమర్దనిగా దుర్గమ్మ దర్శనం


గాంధీనగరం గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


మునగపాక మండలం గణపర్తిలో ఆకట్టుకున్న దుర్గమ్మ సారె ఊరేగింపు


దిమిలి రోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవారు


నాగులాపల్లిలో దుర్గాదేవి అమ్మవారి ఘటాల ఊరేగింపు


మునగపాకలో దుర్గాదేవికి హారతి ఇస్తున్న దృశ్యం


తిమ్మాపురంలో కనక దుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండలంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలుచోట్ల అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గాంధీనగరం గాయత్రీ ఆధ్యాత్మిక జ్ఞానపీఠంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. దిమిలిరోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా విశేషంగా అలంకరించారు. పలుచోట్ల దుర్గమ్మ మండపాల వద్ద అన్నసంతర్పణలు జరిగాయి. భవానీ భక్తుల అమ్మవారి నామస్మరణతో వీధులు మార్మోగుతున్నాయి. పెంజెరువు దుర్గమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. దసరా రోజున సుమారుగా 10 వేల మంది అమ్మవారిని దర్శించుకోనుండడంతో ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణం, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విజయ దుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– హరిపాలెం హిమగిరి కొండపై వెలసిన విజయదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పంచామృత అభిషేకాలు, మహా చండీ యాగం నిర్వహించారు. అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దని అవతారంలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం మాలలు ధరించిన 200 మంది భక్తులు శూలాలు ధరించి అగ్నిగుండం ప్రవేశం చేస్తారని ఆలయ చైర్మన్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ తెలిపారు.

అంబరాన్నంటిన దుర్గాదేవి అంబలం పూజ

మునగపాక: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మాలలు ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. మునగపాక వైఎస్సార్ మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం రాత్రి నిర్వహించిన దుర్గాదేవి అంబలం పూజ అంబరాన్ని అంటింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్ అందరినీ ఆకట్టుకుంది. అమ్మవారికి హారతి ఇచ్చే ఘట్టం కనుల పండువగా జరిగింది. దుర్గమ్మ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. మునగపాక పల్లపు వీధిలోని దుర్గాదేవి అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాగులాపల్లిలో శుక్రవారం అమ్మవారి ఘటాల ఊరేగింపు ఘనంగా జరిగింది. శనివారం పలుచోట్ల అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాంబిల్లి(యలమంచిలి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా పలు చోట్ల దుర్గాదేవి అమ్మవారు మహిషాసురమర్దని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో వైభవ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా శుక్రవారం స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు దర్శించుకున్నారు. అలాగే తిమ్మాపురంలో కనక దుర్గమ్మను కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, గణేష్, ఎంపీటీసీ సభ్యులు బాలం సూరిబాబు, చొప్పా రాజు పాల్గొన్నారు.

కోటవురట్ల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గమ్మ మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కైలాసపట్నంలో గ్రామస్తులంతా ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకెళ్లి సమర్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. రామచంద్రపురంలో పూజలు నిర్వహించి, అన్నసమారాధన జరిపారు.


హరిపాలెంలో విజయదుర్గమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్


మునగపాక పల్లపు వీధిలో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


రామచంద్రపురంలో పూజలు చేస్తున్న భక్తులు


కైలాసపట్నంలో అన్నసమారాధన

తారాజువ్వలా దూసుకెళ్తున్న కూరగాయల ధరలు

తారాస్థాయికి చేరిన...

తారెత్తిస్తున్న కూరగాయల ధరలు


కూరగాయలు

కోటవురట్ల: కూరగాయల ధరలు సామాన్యుడికి దడ పుట్టిస్తున్నాయి. పైకి ఎగబాకిన ధరలు కిందికి దిగిరానంటున్నాయి. దాదాపు 20 రోజులుగా తారాస్థాయికి చేరిన టమాటా ధర ఇక అక్కడే తిష్టవేసింది. ఉల్లి, చిక్కుడు, బెండ, అల్లం, ఇతర కూరగాయల ధరలు ఒకదానికొకటి పోటీ పడుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు. రూ.500 పట్టుకెళితే చిన్న సంచిలోకి కూడా రావడంలేదని వాపోతున్నారు. పండగ పూట ఈ ధరలు సామాన్యుడికి భారంగా పరిణమించాయి. ధరలను అదుపుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందంటూ మండిపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.80, ఉల్లి రూ.60, అల్లం రూ.160, చిక్కుడు, రూ.120, బెండ రూ.60, దొండ రూ.50 వరకు ధర పలుకుతున్నాయి. ఇక వెల్లుల్లి మంట పెడుతోంది. ఏకంగా కిలో రూ.400లకు చేరడంతో సామాన్యుడు దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానిక కృష్ణంరాజు కాలువపై ఉన్న బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చాయి. తప్పించుకునేందుకు అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉద్యోగులతో పాటు పలు పనులపై అనకాపల్లి వెళ్లే వారు అవస్థలు పడ్డారు. గంట పాటు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అతి కష్టంపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.


మునగపాకలో నిలిచిన వాహనాలు

సంతలో పొట్టేళ్ల సందడి


అచ్యుతాపురం వారపు సంతలో పొట్టేళ్లు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం వారపు సంత శుక్రవారం దసరా శోభతో కళకళలాడింది. విజయదశమి పండగ ముందు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చే పొట్టేళ్ల క్రయ, విక్రయదారులతో కిటకిటలాడింది. కొనుగోలుదారులకు అనువుగా ధరలు ఉండడంతో పొట్టేళ్ల కోసం పోటీపడ్డారు. అమ్మకందారులు కూడా పొట్టేళ్లను తమకు నచ్చిన ధరలకు అమ్ముకున్నారు. ఒక్కొక్క పొట్టేలు రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. అచ్యుతాపురం సంతకు పెద్ద సంఖ్యలో పొట్టేళ్లు రావడంతో ఈ ప్రాంతం జనంతో కిక్కిరిసింది. నాటుకోళ్ల అమ్మకాలు కూడా జోరుగా సాగాయి.


పొట్టేళ్ల క్రయ, విక్రయాల దృశ్యం

ఫ్లెక్సీల తొలగింపు

యలమంచిలి రూరల్: పట్టణంలో ప్రధాన, అంతర్గత రహదారుల పక్కన, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తొలగించారు. అనధికార ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లను తొలగించే విషయంలో 2018లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయడం లేదంటూ ఓ న్యాయవాది హైకోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన నేతల ఫ్లెక్సీలు, కటౌట్లను తొలగించేందుకు ఏ చర్యలు తీసుకుంటారో చెప్పాలని ఇటీవల హైకోర్టు అమికస్ క్యూరీ న్యాయవాదిని ఆదేశించింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉన్నతాధికారులు మున్సిపాలిటీల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద కూటమి నేతల ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

నూకాంబిక ఆలయంలో ఊయల ప్రారంభం

యలమంచిలి రూరల్: పీఎస్‌ఆర్‌పేట గ్రామంలోని దుర్గమ్మ, నూకాంబిక ఆలయాల్లో శుక్రవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన అమ్మవారి ఊయలను ఆయన ప్రారంభించారు. అమ్మవారి ఘటాలను ఊయలపై ఉంచి సేవ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజానా శేషు, నానాజీ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, గెంజి శ్రీను, పూటకూటి సత్తిబాబు, మొగ్గ బాబూరావు, ఎడ్ల నానాజీ, గెంజి రమణ పాల్గొన్నారు.


ఊయలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు

ఎస్.రాయవరం: పరిశ్రమలు, ఇతర వాణిజ్య కేంద్రాల్లో 14 ఏళ్లలోపు పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచి బార్ అసోసియేషన్ సభ్యుడు టి.నూకరాజు తెలిపారు. యలమంచిలి కోర్టు జడ్జి నియమించిన బృందం సభ్యులు ఆపరేషన్ స్వేచ్ఛా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పరిశ్రమలు, దుకాణాలు, హోటళ్లను శుక్రవారం తనిఖీలు చేశారు. పని చేస్తున్న ప్రదేశంలో కార్మికులకు రక్షణ లేదని, సేఫ్టీ సామగ్రిని వినియోగించడం లేదని, హోటళ్ల పరిసరాలు పరిశుభ్రంగా లేవని, అపరిశుభ్ర వాతావరణంలో తినే వస్తువులు వండుతున్నట్టు గుర్తించారు. బాల కార్మికులు ఉంటే ఆ వ్యాపార సంస్థల లైసెన్స్ రద్దు చేసి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నూకరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వోలు నూకరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ సిబ్బంది, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.


అడ్డురోడ్డు జీడిపిక్కల పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న స్వేచ్ఛా బృందం సభ్యులు

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు

కోటవురట్ల: ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నెల 14వ తేదీ నుంచి మండలంలోని 25 పంచాయతీల్లో పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. 14న కోటవురట్ల, కైలాసపట్నం, తంగేడు గ్రామాలు, 15న బి.కె.పల్లి, రామచంద్రపాలెం, నీలిగుంట, 16న లింగాపురం, సుంకపూరు, యండపల్లి, 17న పందూరు, రామచంద్రపురం, గొట్టివాడ, 18న పాములవాక, బోడపాలెం, పి.కె.పల్లి, 19న అక్సాహేబుపేట, చినబొడ్డేపల్లి, 21న కె.వెంకటాపురం, రాజుపేట గ్రామాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోరుతూ 14న ధర్నా

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ యునైటెడ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీలను పూర్తి స్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలని, ఎంపీహెచ్‌ఏలుగా పదోన్నతి కల్పించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.